




● బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ● ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మంటలు
● 19 మంది ప్రయాణికులు సజీవ దహనం ● మృతుల్లో ఇద్దరు చిన్నారులు
● బైకర్ దుర్మరణం ● 27 మందికి స్వల్ప గాయాలు
● పోలీసుల అదుపులో ఇద్దరు డ్రైవర్లు ● చిన్నటేకూరు సమీపంలో ఘటన

డెత్ జర్నీ







బైక్ పెట్రోల్ ట్యాంకర్



శవాలను బయటకు తీస్తున్న పోలీసు సిబ్బంది, అధికారులు



పేలని గ్యాస్ సిలిండర్

డెత్ జర్నీ.. అవును వారికి అదే మరణ ప్రయాణం. ఆ ప్రయాణం తల్లీకొడుకులను కాటికి చేర్చింది. తల్లీ కుమార్తెలను బలితీసుకుంది. అన్నదమ్ములను దూరం చేసింది. స్నేహితులకు కన్నీటిని మిగిల్చింది. చక్కనైన ఓ కుటుంబాన్ని మరుభూమికి పంపించేసింది. డ్రైవర్ నిర్లక్ష్యం 20నిండు ప్రాణాలను బలి గొంది. ఎక్కడ చూసినా ఆర్తనాదాలే. ఎవరిని కదిపినా కన్నీటి సుడులే. సాఫీగా సాగాల్సిన ప్రయాణం అర్ధాంతరంగా ఆగి పోయింది. దీపావళి అనంతరం కుటుంబీకులతో గడిపిన ఆనంద క్షణాలు గంటల వ్యవధిలో బాధగా మారాయి. బస్సులో ఇదే చివరి ప్రయాణమని వారికి తెలియదు పాపం. పిల్లాపాపలతో, స్నేహితులతో కలిసి ప్రయాణం ప్రారంభించారు. విధుల్లో చేరేందుకు కొందరు.. బంధు మిత్రులను కలిసేందుకు మరికొందరు.. అత్యవసర పనులపై పలువురు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. భాగ్యనగరం దాటి బస్సు హైవేపై రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లింది. రాత్రి కావటంతో ప్రయాణికులంతా గాఢ నిద్రలోకి జారుకున్నారు. ఇక ఐదారు గంటలైతే అందరూ గమ్యస్థానాలకు చేరుకునేవారు. అంతలోనే ఘోరం జరిగింది. సమయం తెల్లవారుజామున 3:30గంటలు.. హైవేపై ఏదో అలికిడి.. బైక్‌ను బస్సును ఢీకొట్టింది. ఒక్కసారిగా భారీ శబ్దం.. చుట్టూ చిమ్మచీకటి... దట్టమైన పొగలు.. ప్రజల హాహాకారాలు.. సెకండ్ల వ్యవధిలోనే ఘోర ప్రమాదం.. బస్సులో మంటలు వ్యాపించాయి.. కాపాడండి.. రక్షించండి అంటూ ఆర్తనాదాలు.. తలుపులు తెరుచుకోలేదు.. ఏమైందోనని తేరుకునే లోపు జరిగిన రాని నష్టం జరిగింది. గాఢ నిద్రలో ఉన్నవారు మాంసపు ముద్దలుగా మారారు.

ఒకరు కాదు ఇద్దరు ఏకంగా 19మంది అగ్నికి ఆహుతి అయ్యారు. బస్సు కింద పడ్డ ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వెరసి 20 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యుఒడిలోకి చేరుకోగా ఇందులో అభం శుభం తెలియని చిన్నారులు సైతం మృత్యుఒడిలోకి చేరుకున్నారు. జీవమరణ పోరాటంలో ఎలాగైనా నెగ్గాలని కొందరు యువకులు సాహసం చేశారు. గుండెధైర్యాన్ని ప్రదర్శించారు.. ఒక్కసారిగా కండ బలంతో కిటికీలను బద్దలు కొట్టారు.. తమతో పాటు మరి కొంత మందిని బస్సు నుంచి బయటకు లాగారు.. ప్రాణదాతలుగా మారారు. మృతుల బంధువుల రోదనలు.. క్షతగాత్రుల ఆక్రందనలతో హైవే భయానకంగా మారింది.

● వివరాలు 6,7, 9, మెయిన్‌లో...



ఘటన స్థలంలో వెలికి తీసిన మృతదేహాలు



ప్రమాదం నుంచి బయట పడ్డ ప్రయాణికుడు



బస్సులోనే సజీవదహనం అయిన మహిళ



మృతదేహాలను తీసుకెళ్తున్న సిబ్బంది



ఘటన స్థలం వద్ద హోం శాఖ మంత్రి అనిత



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



కాలిపోయిన బస్సులో శవాలను పరిశీలించేందుకు వచ్చిన వైద్య బృందం

సర్వసభ్య సమావేశం వాయిదా

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం శుక్రవారం జరగవలసి ఉండగా వాయిదా వేశారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామం వద్ద బస్సు ప్రమాదం జరిగిన నేపథ్యంలో సమావేశం జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వాయిదా వేస్తూ తీర్మానం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం సమావేశంలో సంతాపం ప్రకటించారు. అంతకుముందు మినీ సమావేశ భవనంలో జరిగిన 1వ స్థాయి సంఘ సమావేశంలో సుమారు రూ.4.84 కోట్ల పనులను సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితో శ్రీశైల క్షేత్రాభివృద్ధికి శ్రీకారం

● ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రమేష్ నాయుడు
● మూడు దశల్లో మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు
● భక్తులకు మల్లన్న స్పర్శ దర్శనం, ఉచిత లడ్డూ
● సామాన్య భక్తులకే పెద్దపీట
● కార్తీక మాస ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
● అధికారులు బోర్డు సభ్యుల మధ్య పరిచయ వేదికగా తొలి సమావేశం

శ్రీశైలం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్ర వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులు సఫలీకృతమయ్యేలా ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేసేందుకు శ్రీకారం చుట్టినట్లు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు. శుక్రవారం చైర్మన్ అధ్యక్షతన ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేవస్థాన కమాండ్ కంట్రోల్ హాల్‌లో జరిగిన ట్రస్ట్‌బోర్డ్ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రాభివృద్ధిలో భాగంగా పాతికేళ్ల ముందస్తు చూపుతో చేస్తున్న మూడు దశల మాస్టర్‌ప్లాన్ అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ట్రస్‌బోర్డ్ తొలి సమావేశం అయినందున దేవస్థాన అధికారులు సిబ్బందితో కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం తరువాత ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ పర్యటన వివరాలతోపాటు, ఆలయ ఆదాయ వ్యయాలు, భక్తుల వసతి, సదుపాయాలు, దర్శన విధానాలు, అన్నప్రసాద వితరణ పథకాలను వివరించారు. అదే విధంగా ప్రస్తుత కార్తీక మాసంలో చేసే ప్రత్యేక కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు కలుగకుండా స్వామి, అమ్మవార్ల దర్శనాలు కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 31న జరిగే కృష్ణమ్మతల్లికి నదీ హారతి, నవంబర్ 14న కోటి దీపోత్సవం, 18న జరిగే తెప్పోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచనలిచ్చారు. మల్లన్న స్పర్శ దర్శనం చేసుకునే భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం ఇవ్వాలని తొలి సమావేశంలో తీర్మానించడం ఆనందదాయకంగా ఉందన్నారు. కార్తీక మాసంలో లక్షలాదిగా వచ్చే సామాన్య భక్తులందరికీ రద్దీ రోజుల్లో ప్రాధాన్యత ఇచ్చి అలంకార దర్శనం మాత్రమే కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు.



మాట్లాడుతున్న ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రమేష్ నాయుడు

ఈనెల 27న మరో ఇద్దరు బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం...

శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులలో మరో ఇద్దరు సోమవారం శుభముహూర్తంలో బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు చైర్మెన్ రమేష్‌నాయుడు ప్రకటించారు. చిటా బొట్ల భరద్వాజశర్మ, గుళ్ల గంగమ్మ కూడా క్షేత్రాభివృద్ధిలో భాగం కావాలని కోరారు.

27 నుంచి పత్తి కొనుగోళ్లు

● రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి
● ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఈ నెల 27 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, ఇప్పటి నుంచే రైతులు తమ పొలం పంట వివరాలను కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలని కర్నూలు జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. కర్నూలు జిల్లాలో పత్తికి క్వింటానికి కేంద్ర ప్రభుత్వం రూ.8,110 మద్దతు ధరగా నిర్ణయించిందని, ఈ ధర రావాలం టే తేమ శాతం 8 లోపు ఉండాలని స్పష్టం చేశా రు. కర్నూలు జిల్లాలో పత్తి కొనుగోలుకు 20 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకునేందుకు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఎంతో కలచి వేసింది

● మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద ఓ ప్రైవేటు బస్సు దగ్ధమైన ఘటన పై ఆర్అండ్‌బీ శాఖ మంత్రి శుక్రవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈఘటనలో 19 మంది దుర్మరణం చెందడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుబాయ్ పర్యటనలో ఉన్న మంత్రి బీసీ జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికులు బస్సులోనే కాలి బూడిద కావడం తనను ఎంతో కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి బీసీ తెలిపారు.

అత్యంత బాధాకరం

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కావేరి ట్రావెల్స్ బస్సు దుర్ఘటనలో ప్రయాణికుల సజీవ దహనం కావడం అత్యంత బాధాకరమన్నారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించాలి

● మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



డోన్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు సమీపంలో శుక్రవారం జరిగిన బస్సు ప్రమాదం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



డోన్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. అగ్ని ప్రమాదంలో 20 మంది మరణించడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇలాంటి విషాద ఘటనలు మళ్లీ జరగకుండా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సత్వర సహాయం అందించేలా..

● సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తుంది. బాధిత కుటుంబాలకు సత్వర సహాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్రమాదం విచారకరం



కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ప్రమాదంపై కుడా చైర్మన్ సోమిశెట్టి విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే ఘటనాస్థలికి చేరుకొని ప్రమాద తీరును అక్కడి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

పునరావృతం కాకుండా చర్యలు

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పత్తికొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో ప్రయాణికులు సజీవ దహనం కావడం బాధాకరమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఘటనాస్థలిని పరిశీలించిన..



కర్నూలు అర్బన్ చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనాస్థలిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, డీసీఎంఎస్‌చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ పరిశీలించారు. సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు.



డెత్ జర్నీ

- మొత్తం బుక్ చేసుకున్న ప్రయాణికులు - 40
- బస్సు ఎక్కని ప్రయాణికుడు (తరుణ్) - 1
- జడ్చర్ల వద్ద ఎక్కిన ప్రయాణికులు -1
- డ్రైవర్లు -2 ● మృతులు 19 ● బైకర్ -1
- ప్రాణాలతో బయటపడిన వారు : 25 మంది

కర్నూలు క్రైం/కల్లూరు, కర్నూలు అర్బన్, కర్నూలు హాస్పిటల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): **హైదరాబాద్ నుంచి మొదలైన బస్సు ప్రయాణం డెత్ జర్నీగా మారింది. హైదరాబాదు-బెంగళూరు హైవేలో ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చెట్లమల్లాపురం గ్రామ సమీపంలో చిన్నటేకూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 3:30గంటలకు కావేరి ట్రావెల్ బస్సు ఓమోటారు సైకిల్‌ను ఢీకొట్టి బైకును ఈడ్చుకుంటూ వెళ్లే క్రమంలో మంటలు వ్యాపించాయి. ఈ మంటలు క్రమక్రమంగా బస్సు అంతా వ్యాపించడంతో తప్పించుకునే వీల్లేని విధంగా ఉండటంతో 19మంది ప్రయాణికులు మంటల్లో గుర్తు పట్టలేని విదంగా సజీవ దహనం అయ్యారు. అప్రమత్తమై 27మంది ప్రాణాలతో బయటపడ్డారు. వీరంతా స్వల్ప గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. మృతి చెందిన వారిలో ఇద్దరు చిన్నపిల్లలు ఉండటం గమనార్హం. బస్సు డ్రైవర్లలో ఒకరిని పోలీసులు అదుపులో తీసుకోగా, మరొకరు పరారయ్యాడు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.**

హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తూ..

హైదరాబాదు నుంచి కావేరి ట్రావెల్ బస్సు బెంగళూరు వెళ్తుంది. హైదరాబాదులో సుమారు 11.30 గంటలకు బయలుదేరింది. కర్నూలుకు వచ్చేసరికి రాత్రి 2.30 నుంచి 3 గంటలై ఉంటుంది. ఉలిందకొండ బైపాస్‌కు వచ్చేటప్పటికి బస్సు వేగం వంద కిలోమీటర్లపైనే ఉంటుంది. ఉలిందకొండ బైపాస్ రహదారికి చేరుకునేటప్పటికే ఈ ట్రావెల్స్ బస్సు ముందు ఓ బైకర్ వెళ్తున్నాడు. బస్సు ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. ట్రావెల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంగా ముందుకెళ్లాడు. ఈక్రమంలో ఆ బైక్ బస్సు కింద ఇరుక్కుకోవడం, ఆవేగంతో బైక్‌ను ఈడ్చుకుంటూ వెళ్లాడు. 80మీటర్లు వెళ్లిన తర్వాత బైక్-రోడ్డుకు జరిగిన రాపిడిలో చిన్నచిన్న మంటలు వ్యాపించాయి. బస్సు డ్రైవర్ కొంత మంటలు వచ్చాయనీ గమనించి కాస్త ముందుకు వెళ్లి ఎడమ వైపునకు తీసుకుని వెళ్లి ఆ పాడు. అప్పటికే ప్రధాన డోర్ వైపు మంటలు రావడం గుర్తించిన మ రో డ్రైవర్‌ను అప్రమత్తం చేసి మంటలు ఆపే ప్రయత్నం చేశాడు. కొన్నిమంటలు ఆరిపోయినట్లుగానే అనిపించి ఒక్కసారిగా మళ్లీ మం టలు వ్యాపించాయి. ప్రధాన డోర్ లాక్ సిస్టమ్ ఫెయిలై డోర్ పూర్తిగా మూసుకుపోయింది. ఆ తర్వాత మంటలు ఎక్కువగా వ్యాపించడం, అప్పుడు డ్రైవర్లు ఇద్దరు ప్రయాణికులను అప్రమత్తం చేశారు.

ప్రయాణికులు నిద్రమత్తులో..

ప్రయాణికులు నిద్రమత్తులో ఉండటంతో ఐదారు మంది ప్రమాదాన్ని గుర్తించి తోటి ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో అందరూ ఒక్కసారిగా తప్పించుకనే ప్రయత్నం చేశారు. బస్సు డబుల్ సీటర్‌తో పాటు ఆ రెండు సీట్ల మధ్య కేవలం ఒక మనిషి వెళ్లే మార్గం ఉండటంతో ఒకరిపై ఒకరు తోసుకున్నారు. వెనుక ఉన్న అద్దాలు తప్ప మినహాయించి మరీ అద్దాలు పగులకొట్టేందుకు వీలు కాలేదు. బెంగుళూరు చెందిన ఓ ముగ్గురు ప్రయాణికులు డ్రైవర్ వెనుకాల ఉన్న రెండు అద్దాలను అతికష్టం పగలకొట్టారు. బయటకు వచ్చేందుకు ఐరన్ గ్రిల్స్ ఉండటం, మనిషి దూరే సందు కూడా ఆ గ్రిల్స్ మధ్య లేకపోవడంతో అతికష్టమీద బయటపడ్డారు. మిగతా వారంతా వెనుకవైపు వెళ్లాలనే తొందరలో ఒకరిపై ఒకరు తోసుకున్నారు. ఐదారు నిమిషాల్లోనే మంటలు పెద్దఎత్తున బస్సు అంతా వ్యాపించడం, పొగ కమ్ముకోవడంతో తప్పించుకోలేకపోయారు. ఈ ప్రమాదం నుంచి 25 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు మాత్రం తప్పించుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారిలో ఒకే కు టుంబానికి చెందిన నలుగురు ఉండటం, చనిపోయిన కుటుంబాల్లో ఒకే కటుంబానికి చెందిన నలుగురు ఉండటం.. ఈ రెండు కుటుంబాలు మిత్రులు కావడం విశేషం.

తెల్లవారుజాము నుంచే వైద్య సేవలు: సూపరింటెండెంట్



డా. వెంకటేశ్వర్లు, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెట్



డాక్టర్ సాయి సుధీర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్ అగ్ని ప్రమాదానికి గురైందని తెలుసుకుని తెల్లవారు జామున 5 గంటలకే క్యాజువాల్టీకి వచ్చా.. క్షతగాత్రులు ఎలా ఉన్నదీ ఆరా తీశాను.. పరీక్షలు త్వరగా చేయాలని ఆదేశించా.. ప్రమాద స్థలానికి ఫోరెన్సిక్ వైద్య బృందాలు వెళ్లాలని హెచ్ఓడీ డా. సాయి సుధీర్‌ను ఆదేశించా.. అని పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైన నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ క్షతగాత్రులకు వెంటనే తగిన వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. తెల్లవారుజామున 5.30కు డా. సాయి సుధీర్ ప్రమాదస్థలికి వెళ్లాక 6 గంటలకు మృత దేహాల కోసం మహాప్రస్థాన వాహనాలు ఐదు సిద్ధంగా ఉంచాలని సీఎస్ఆర్ఎంవో వెంకటరమణను సూపరింటెండెంట్ ఆదేశించారు. దీంతో పాటు మృత దేహాల తరలింపు కోసం 35 దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఘటన స్థలం నుంచి 19 మృత దేహాల భద్రత కోసం 15 ఫ్రీజర్ బాక్స్‌ను ప్రైవేట్ సంస్థల నుంచి తెప్పించారు. క్షతగాత్రుల్లో 12మందిని చికిత్సకు తీసుకున్నారు. ఇందులో నవీన్‌కుమార్, సత్య నారాయణలకు ఎడమ కాలుకు ఫ్రాక్చర్ కాగా, సూర్యకు రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయని ఆయన తెలిపారు. 12 మందిలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గూసాయి కుమార్ హాస్పిటల్‌లో అడ్మిషన్‌లో ఉండగా మిగిలిన 11మంది క్షతగాత్రులు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు.

మొదటిసారిగా 19 మృతదేహాలకు పోస్టుమార్టం

డాక్టర్ సాయి సుధీర్

కర్నూల్లో మొట్టమొదటిసారిగా ఒకేసారి 19మంది మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాల్సి వచ్చింది. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు తెల్లవారు జామున 5.30 గంటలకు బస్సు ప్రమాద ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలించాం. ఉదయం 8.30 గంటలకు ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డా. బ్రహ్మాజీ మాస్టర్ నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పది మంది పీజీలతో కూడిన 16 మంది వైద్యబృందం ఘటన స్థలానికి చేరుకుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లో 19 మందికి పోస్టు మార్టం నిర్వహించింది. మృత దేహాలన్నీ పూర్తిగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం సాధ్యం కాలేదు. అక్కడే వాటి నుంచి డీఎన్ఏ శ్యాంపిల్స్‌ను సేకరించారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత మృతదేహాలను మహాప్రస్థానం వాహనాల్లో మార్చురీకి తరలించి అక్కడ ఫ్రీజర్ బాక్స్‌ల్లో భద్రపరిచారు. ఫోరెన్సిక్ వైద్యలు సేకరించిన డీఎన్ ఏ శ్యాంపిల్స్‌ను అమరావతికి పంపించాం. ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్ వైద్యులు మార్చురీ వద్ద బంధువుల నుంచి డీఎన్ఏ శ్యాంపిల్స్‌ను సేకరించి మృతి చెందిన వారి డీఎన్ఏతో సరిచూసి మృత దేహాలను అప్పగిస్తాం.

పోలీసుల సహాయక చర్యలు

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు



కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతానికి కేవలం 20 నుంచి 30 నిమిషాల్లోపే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ అక్కడకు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. కొంత మంది క్షతగాత్రులను అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఆ వెంటనే డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత కొద్దిసేపటికి కలెక్టర్ డా. సిరి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఏపీఎస్పీ, ఏఆర్ బలగాలను అక్కడకు రప్పించి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. పూర్తిగా అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించేందుకు అక్కడే టెంట్లు ఏర్పాటు చేశారు. మరోవైపు ట్రాఫిక్ జామ్ కాకుండా నిరంతరంగా శ్రమించారు. వాహనాలను మళ్లించి మరో ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ సహాయ చర్యలు చేపట్టారు. అనంతరం ఫోరెన్స్ ల్యాబ్ సిబ్బంది అక్కడకు వచ్చి అన్ని నమూనాలు సేకరించారు. బసులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడానికి కారణాలను, అందులో ఉన్న పదార్థాలను, బస్సు తయారీకి వాడిన పరికరాలను శాంపిల్స్‌ను సేకరించారు. ఇందు కోసం ప్రత్యేక బృందం అక్కడకు చేరుకుంది. మరో వైపు ఎస్‌డీఆర్‌ఎఫ్ (అగ్నిమాపక సిబ్బంది) ఫైరింజన్లతో అక్కడకు చేరుకున్నారు. బస్సు ఐరన్ గ్రిల్స్‌కు 3వేల డిగ్రీ సెల్సీయస్ వేడి ఉండటంతో సహాయ చర్యలు ఇబ్బందిగా మారాయి. సుమారు 20 మంది సీఐలు, పది మంది ఎస్ఐలు, వంద మందికి పైగా పోలీసు సిబ్బంది మృతదేహాల వివరాలను సేకరించే ప్రయత్నం చేశారు. మృతదేహాల పోస్టుమార్టం కోసం రక్తనమూనాల సేకరణ కోసం ఒక్కో మృతదేహానికి ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐని నియమించి ప్రత్యేకంగా పంచనామా చేయించారు. మరో వైపు మంత్రులు, ఎమ్మెల్యేలు అక్కడకు వచ్చిన సందర్భంగా ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేకంగా రోప్ పార్టీలను ఏర్పాటు చేశారు.

జీజీహెచ్‌లో చికిత్స

● 12 మందికి గాయాలు.. ● నిలకడగా క్షతగాత్రుల ఆరోగ్యం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదంలో గాయపడ్డ 12 మందికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించారు. నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న ఆకాష్ హాస్పిటల్‌లో మరో ముగ్గురు చేరారు. కర్నూలు జీజీహెచ్‌లో 12 మందిలోంచి ఐదుగురు డిశ్చార్జ్ అయ్యారు. తూర్పు గోదావరి కత్రని కోనకు చెందిన గుణసాయి కుమార్ (33), ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సత్యనారాయణ (27), హైదరాబాదుకు చెందిన నవీన్ కుమార్ (26), సూర్య (27), హారిక (30), నెల్లూరు జిల్లా వేదాయపల్లెంకు చెందిన శ్రీహర్ష (25), నెల్లూరుకు చెందిన అశోక్ (27).. కర్నూలు జీజీహెచ్ క్యాజువాల్టీలో చేరి చికిత్స పొందుతున్నారు. మిగతా వారికి స్వల్పగాయాలు కావడంతో ఉండటంతో చికిత్స తీసుకుని క్షతగాత్రులు డిశ్చార్జ్ అయ్యారు. నెల్లూరు జిల్లా వేదాయపాలెం చెందిన హారిక తలకు గాయాలు కాగా, ఆమెకు సిటీ స్కాన్ చేసి చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు ఆమెను డిశ్చార్జ్ చేశారు. సత్యనారాయణకు, నవీన్ కుమార్‌కు ఎడమ కాలు ఫ్యాక్చర్ కావడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. హైదరాబాదు మియాపూర్‌కు చెందిన సూర్యకు రెండు కాళ్లు విరగడంతో ఆర్థో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గుణ సాయికుమార్ ఊపిరి తీసుకోవడం ఇబ్బంది పడుతున్నందు వల్ల ఆక్సిజన్ అందిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్న వారిలో గుణ సాయికుమార్ తప్ప అందరూ డిశ్చార్జ్ అయ్యారు.

తెల్లవారుజామున 3.30 గంటలకు..



తెల్లవారుజామున 3.30 గంటలకు బస్సు ఆగింది. వాష్ రూమ్ అవసరానికి ఆగిందని అనుకున్నా. నిమిషాల్లో మంటలొచ్చాయి. పక్కన ఉన్నవారు బస్సు అద్దాలు పగులకొట్టారు. దీంతో కిటికీ గుండా బయటకు వచ్చాను. ఆ సమయంలో చేతికి, నడుముకు గాయాలయ్యాయి. నా తర్వాత ముగ్గురు, నలుగురు కిటికీనుంచి కిందకు దిగారు.

● అశోక్, ఐటీ ఉద్యోగి, హైదరాబాదు

30 సెకన్లలో మంటలు వ్యాపించాయి



బస్సు చివరి సీటులో కూర్చున్నాను. 3 గంటల దాటిన తర్వాత పొగ వచ్చింది. ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారింది. 30 సెకన్లలో మంటలు వేగంగా వ్యాపించాయి. కిందకు దిగే ప్రయత్నంలో తలకు, చేతికి గాయాలు అయ్యాయి. కర్నూలు ఆసుపత్రిలో సిటీ స్కాన్‌లో నార్మల్ అని రిపోర్టు వచ్చింది.

● హారిక, వేదాయపాలెం, నెల్లూరు

ఇది పునర్జన్మ : సుబ్రహ్మణ్యం, కాకినాడ

తెల్లవారుజామున బాగా నిద్రపట్టింది. బస్సులోకి పొగ వ్యాపించింది. వెంటనే మంటలు వచ్చాయి. ఇక అయిపోయిందనుకున్నా. వెనుక భాగంలో ఉన్న అద్దాలు పగులుకొట్టడంతో అందులో నుంచి బయటకు వచ్చాను. నా చేతికి గాయమైంది. ఇది నిజంగా నాకు పునర్జన్మ.

భయమేసింది



బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగం కోసం బెంగుళూరు బస్సులో బయలుదేరా. సరిగ్గా 3.30 గంటలకు బస్సులో పొగ, మంటలు రావడం గమనించా. బస్సు మధ్యలో ఉన్నందు వల్ల ప్రాణాల మీద ఆశలు వదులుకున్నా. చాలా భయమేసింది. అద్దాలు పగులకొట్టుకొని బయటపడ్డా.

- సత్యనారాయణ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా, తెలంగాణ

అరుపులు విని ఉలిక్కిపడ్డా

- శ్రీహర్ష, ఐటీ ఉద్యోగి, నెల్లూరు



బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేస్తున్నాను. రాత్రి 11.30 గంటల సమయంలో హైదరాబాదు నుంచి బెంగుళూరుకు బస్సులో బయలుదేరాను. తెల్లవారుజామున అరుపులు, కేకలు విని ఉలిక్కిపడ్డా, బయట తొంగి చూస్తే మంటలు. అంతే రెండు నిమిషాల్లో మంటలు, పొగను దాటుకుంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటకు వచ్చా.

ఇంటర్వ్యూకు వెళ్తుంటే

● సూర్య, క్షతగాత్రుడు, హైదరాబాద్



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూ కోసం బెంగళూరుకు గురువారం రాత్రి ప్రైవేటు బస్సులో బయలుదేరినట్లు క్షతగాత్రుడు హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన సూర్య తెలిపారు. బస్సులో ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. చివరి సీటులో కూర్చున్న తాను బయటకు వచ్చే సమయంలో కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడం బాధగా ఉంది. త్వరగా కోలుకొని ఉద్యోగం సాధిస్తానని సూర్య పేర్కొన్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



బస్సు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యుల పై చర్యలు తీసుకుంటామని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం ఘటనాస్థలిని ఆయన పరిశీలించారు. సజీవ దహనమైన మృతదేహాలను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. అక్కడ ఉన్న అధికారులు, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు.

హేమారెడ్డి తీరు భేష్



కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగిన వెంటనే ఓ మహిళ స్పందించిన తీరు అందరితో భేష్ అనిపించుకుంది. హేమారెడ్డి అనే మహిళ పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంది. ఆమె వెంట డ్రైవర్ ఉన్నాడు. పుట్టపర్తిలో రాత్రి 11 గంటలకు బయలుదేరగా చిన్నటేకూరు వద్దకు 3.30గంటలకు చేరింది. ప్రమాద స్థలం వద్దకు వచ్చేటప్పటికీ ట్రాఫిక్ స్తంభించి ఉండగా డ్రైవర్‌ను ప్రశ్నించింది. ఓ బస్సు మంటల్లో కాలిపోతుందని అతడు చెప్పాడు. బస్సు మంటల్లో దగ్ధం అవుతుండటంతో సెల్‌ఫోన్‌ను కారులోనే పెట్టి ఘటనాస్థలికి చేరుకొంది. ఆ సమయంలో ఓ యువకుడు సెల్‌ఫోన్ కోసం పలువురి వేడుకుంటున్న దృశ్యాలు ఆమె కంట పడ్డాయి. ఆ ప్రాంతంలో ఎవరూ సెల్‌ఫోన్ ఇవ్వకపోగా వీడియోలు తీయడంలో నిమగ్నమయ్యారు. ఆ యువకునితో కలిసి మరి కొంత మందిని సెల్‌ఫోన్ అడిగింది. ఓ వ్యక్తి ఫోన్ తీసుకొని హేమారెడ్డి తనకు తెలిసిన ఓ పోలీస్ అధికారికి ఫోన్ చేసి కర్నూలు ఎస్పీ నంబర్ తీసుకొని ఎస్పీకి సమాచారమిచ్చారు. ఎస్పీ కూడా వెంటనే ఎస్‌బీ సీఐ తేజోమూర్తికి అప్రమత్తం చేశాడు. సీఐ వెంటనే స్పందించారు. కర్నూలు పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారని హేమారెడ్డి తెలిపారు.

ఆ తల్లికి ఎంత శోకమో..!

● ఇప్పటికే భర్త మృతి ● నేడు కొడుకు దుర్మరణం ● బైక్‌ను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



రోదిస్తున్న శివశంకర్ బంధువులు





శివశంకర్(ఫైల్)

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదు. ఇప్పటికే భర్త కోల్పోయి కడు దుఃఖంలో ఉండగా.. చేతికొచ్చిన కొడుకు సైతం అనంత లోకాలకు చేరాడు.. ఆమెకు పుత్రశోకాన్ని తెచ్చి పెట్టాడు. భర్త లేడన్న బాధను దిగమింగుకొని కొడుకులను చూసుకుంటూ జీవన పోరాటం సాగిస్తుండేది. పెద్ద కొడుకుకు పెళ్లి చేసి ఓ ఇంటి వాడిని చేసింది. ఇక చిన్న కుమారుడు సైతం కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. వీరి కుటుంబం అంతా కూలీనాలి చేసుకుంటూ వచ్చిన దాంట్లో సంతోషంగా గడిపేవారు. ఒక్కసారిగా విధి వక్రీకరించింది. చేతికొచ్చి చేదోడు వాదోడుగా ఉంటాడు అనుకున్న కొడుకు జీవచ్ఛవంలా ఉండటం ఆ తల్లి జీర్ణించుకోలేకపోతోంది. దేవుడా.. నాకేంటి ఈ ఖర్మ అంటూ గుండె బాదుకుంటూ రోదిస్తున్న తీరును చూస్తే ప్రతి ఒక్కరికి కన్నీళ్లు రావాల్సిందే.

కూలి పనులకు వెళ్తూ..


కూలీ పనులకు వెళ్తూ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో కర్నూలు నగర శివారు టీవీ 9 కాలనీకి చెందిన శివశంకర్(24) దుర్మరణం చెందాడు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ జిల్లా అలంపూరం మండలంలో కసాపురానికి చెందిన నాగన్న, యశోద దంపతులు. వీరి కుమారులు శ్రీహరి, శివశంకర్. 2015లో నాగన్న మృతి చెందారు. నగరు శివారులోని టీవీ9 కాలనీకి యశోద తన పిల్లలను తీసుకువచ్చి అక్కడే ఉండి జీవనం కొనసాగిస్తుంది. శివశంకర్ గ్రానైట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీహరికి వివాహం కాగా మృతుడి శివశంకర్‌కు ఇంకా పెళ్లి కాలేదు. అన్న, తల్లి గౌండ పనులు చేస్తున్నారు. ఇంతకుముందే భర్తని కోల్పోయిన తల్లికి పుత్ర శోకం వచ్చింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద ఆ తల్లి ఆర్తనాదాలు పలువురికి కన్నీళ్లు తెప్పించాయి. మార్చురీకి వచ్చిన శివశంకర్ బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పెళ్లికాకుండానే అనంత లోకాలకు వెళ్లావా నాయనా అంటూ పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు.

అత్యంత దురదృష్టకరం

కర్నూలు అర్బన్: బస్ ద గ్ధమైన ఘటనపై ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈఘటనలో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత దురదృష్ట కరమన్నారు. చనిపోయిన వారికి ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, చికిత్స పొందుతున్న వారికి రూ.25లక్షల పరిహారమివ్వాలని కోరారు.

మిత్రుడి రూపంలో తప్పిన మృత్యువు

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వీ కావేరి ట్రావెల్ బస్సులో యూ-2 (అప్పర్ బెడ్-2) బుక్ చేసుకున్న ఓ యువకుడు మృత్యువు నుంచి ఎలా తప్పించుకున్నాడో తెలిస్తే.. ఆశ్చర్యం కలగకమానదు. బెంగుళూరు చెందిన తరుణ్ నేవీలో ఉద్యోగి. దీపావళి పండుగ కోసమని హైదరాబాదు వచ్చాడు. బెంగుళూరు వెళ్లేందుకు 23వ తేదీ సాయంత్రం 5.40 గంటలకు కావేరి ట్రావెల్స్‌లో యూ-2ను బుక్ చేసుకున్నాడు. రాత్రి 9గంటల ప్రాంతంలో ప్యారడైజ్ వద్ద ఈయన పికప్ వ్యాన్‌లో ఎక్కేశాడు. తర్వాత అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ప్రధాన బస్సు వద్దకు చేర్చింది. తీరా బస్సు ఎక్కే సమయంలో తరుణ్‌కు ఓమిత్రుడు ఫోన్ చేసి వచ్చి సెండాఫ్ ఇస్తానని చెప్పాడు. తరుణ్ ఐదు నిమిషాలు బస్సు ఆపాలని కోరాడు. ఇప్పటికే లేటు అయిందంటూ డ్రైవర్ బస్సును కదిలించేశాడు. తన టికెట్ ధర పోయినా, టికెట్ క్యాన్సల్ అయినా మరో బస్సు ఎక్కి వెళ్దాంలే అని తరుణ్ ఆగిపోయాడు. పది నిమిషాల్లో మిత్రుడు రావడం, మిత్రుడిని కలవడం, అదే రూట్‌లో బెంగుళూరు వెళ్లే ట్రావెల్ బస్సు ఎక్కడం అంతా గంటలో జరిగిపోయింది. ఆతర్వాత 4 గంటల ప్రాంతంలో తాను ముందు ఎక్కాల్సిన బస్సు అక్కడ మంటల్లో దగ్ధం అవడం గమనించి షాక్‌కు గురయ్యాడు. దేవుడు తనను మిత్రుని రూపంలో రక్షించాడంటూ ఆనందం వ్యక్తం చేశాడు.



బస్సులో అగ్నికీలలు

తీవ్రంగా కలచి వేసింది

• పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు సమీపంలోని జాతీయ రహదారిపై కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం దురదృష్టకరమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. బస్సు ప్రయాణికులు సజీవ దహనం కావడం నన్ను తీవ్రంగా కలిచి వేసింది. ప్రమాద ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పోలీసులతో అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడామని మృతులు, ప్రమాద బాధితులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు.

న్యాయం జరిగేలా చూస్తాం



ప్రమాద స్థలంలో ఎంపీ బైరెడ్డి శబరి

• నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సందర్శించి పోలీసులు, ఉన్నతాధికారులతో ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకుంటోందని, న్యాయం చేసేలా చూస్తామన్నారు.

రూ.కోటి పరిహారమివ్వాలి

• మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

చిన్నటేకూరు బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని నాయకులు, ప్రజలతో ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

స్నేహితుడిని కాపాడలేకపోయా...



ఎన్ రమేష్

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన ఎన్.రమేష్, జి.రమేష్ ఇద్దరూ మిత్రులు. వీరిద్దరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదుకు వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో జి. రమేష్ ఆయన భార్య, ఇద్దరు పిల్లలు మృతిచెందారు. మొదట ఎన్.రమేష్ తన భార్య పిల్లలను అప్రమత్తం చేసి, స్నేహితుని భార్య పిల్లలను కూడా అప్రమత్తం చేశాడు. వెనుక మార్గం ద్వారా తాను, తన కుటుంబం తప్పించుకున్నా, స్నేహితుని కుటుంబం తప్పించుకోలేకపోవడంతో ఘటన స్థలం వద్ద కన్నీటి పర్యంతం అయ్యాడు. తన స్నేహితున్ని కాపాడుకోలేకపోయానని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకరికొకరు సాయం చేసుకొని..

• ప్రమాదం నుంచి బయడపడ్డ ముగ్గురు



ప్రమాదంనుంచి బయటపడ్డ జయంత్, ఆకాశ్, అశ్విన్

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ఓ ముగ్గురు యువకులు ఒకరికి ఒకరు సహాయం చేసుకొని తప్పించుకున్న పలువురిని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. బెంగుళూరుకు చెందిన జయంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి (సీటు నెం.యు7), మరో యువకుడు ఆకాశ్ ఏషియన్ పెయింట్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ (సీటు యూ3), అశ్విన్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి(సీటు ఎల్1) ఈ బస్సులో ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వీరికి ఎటుపోవాలో అర్థం కాలేదు. డ్రైవర్ సీటువెనుక కుడివైపు ఉన్న అద్దాన్ని పగులగొట్టే ప్రయత్నం చేశారు. మొదట అద్దం ధ్వంసం కాలేదు. గట్టి ప్రయత్నం చేసి పగులగొట్టారు. అయితే అద్దం పగిలిన తర్వాత బయటవైపు ఐరన్ గిల్స్ ఉన్నాయి. అవి కూడా చిన్నచిన్న సందులతో ఉన్నాయి. ఆ సందుల్లోంచి బయటకు రావడం కష్టమైన పనే. అయితే ఈ ముగ్గురూ ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ ఆ సందులోనే బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. కాగా, ఆకాశ్ అనే యువకుడు తన ల్యాబ్‌టాప్‌తో సహా బయట పడటం విశేషం. వీరి సెల్‌ఫోన్లు మాత్రం అక్కడే వదిలేశారు.

మూగబోయిన సెల్‌ఫోన్లు...

ప్రమాదంలో ప్రయాణీకులందరి సెల్‌ఫోన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. దీంతో ప్రయాణీకుల కోసం వారి వారి బంధువులు ఫోన్లు చేస్తుంటే స్విచ్ ఆఫ్ రావడంతో, మృతుల కుటుంబ సభ్యులతోపాటూ, బతికి బయటపడ్డ వారి కుటుంబ సభ్యులు క్షేమ సమాచారం కోసం పడిన తిప్పలు వర్ణనాతీతం.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

మృతుల సమాచారం, ప్రమాదం నుంచీ బయటపడిన వారి సమాచారం కోసం పోలీసులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఘటన స్థలంలో ఉన్న కంట్రోల్ రూమ్ నెం.9121101061, పోలీసు కార్యాలయం కంట్రోల్ రూమ్ 9121101075 నెంబర్లు ఏర్పాటు చేసి సహాయ సహకారాలు అందించారు. పలు సోషల్ మీడియాల్లో నెంబర్లు స్ర్కోల్ కావడంతో బాధితుల బంధువులంతా ఈ నెంబర్లకు ఫోన్లు చేసి సమాచారం తెలుసుకున్నారు.

భయానక హైవే

• పుర్రెలు.. కాలిన మృతదేహాలు
• రోడ్ల వెంట బారులుదీరిన వాహనాలు
• ఘటనాస్థలికి చేరుకుంటున్న బాధిత కుటుంబాలు



కాలిపోయిన మృతదేహాలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు బస్సు ప్రమాద ఘటనతో పుర్రెలు.. కాలిన మృతదేహాలు.. బాధిత కుటుంబాల రోదనలతో హైవే భయానకంగా తయారైంది. ఘటన విషయం తెలియగానే పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నాయి. ప్రమాద ఘటన నుంచి బయట పడిన బాధితులు వివరిస్తున్న తీరును అక్కడికి చేరుకున్న వారు వింటున్న సంఘటనలు కనిపించాయి. బాధిత కుటుంబాలు ఎలా జరిగింది.. మా కుటుంబ సభ్యులను ఎందుకు నిద్ర లేప లేదు.. అంటూ కర్నూలు నగరం నుంచి అక్కడికి చేరుకున్న నెల్లూరుకు చెందిన మాధవి.. మా బంధువులు గోళ్ల రమేష్ కుటుంబాన్ని .. లేపి ఉండవచ్చు కదా.. అని హైదరాబాద్‌కు చెందిన అశ్విన్ రెడ్డిని అడుగుతూ బాధాతప్త హృదయంతో కనిపించారు. హైదరాబాద్‌కు చెందిన జయంత్‌కుశ్వహ్ మాట్లాడుతూ బస్‌లో చివరికి వెళిఅద్దం పగల కొట్టడంతో మరో పది మందిని కాపాడాను.. కానీ మిగిలిన వారిని కాపాడుకునే క్రమంలో మంటలు క్షణాల్లో బస్‌ను చుట్టుముట్టాయి. డ్రైవర్ బస్‌ను నిలిపి వేసి ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదు. తెల్లవారే సరికి జాతీయ రహదారి పోలీస్ పహారాలో ఉంది. జాతీయ రహదారి వన్‌వేగా సాగింది. రోడ్ల వెంట వాహనాలు బారులు దీరాయి. పోలీసులు, వైద్య సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాలను కర్నూలుకు తరలించే ప్రక్రియను చేపట్టారు. సహాయక చర్యలు వేగంగా సాగుతున్నాయి.



దగ్ధమవుతున్న బస్సు

ఫ్లైట్ ఎక్కబోయి..బస్ ఎక్కా..

కర్నూలు అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫ్లైట్ ఎక్క బోయి చివరి నిమిషంలో బస్సు ఎక్కినట్లు హైదరాబాద్‌లోని బీరంగూడకు చెందిన అశ్విన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. డ్రైవర్ వెనుక ఎల్-1 సీట్లో కూర్చున్నానని, పెద్ద శబ్దం రాగా కర్టెన్ తీసి చూశా. మంటలు. బయటకు దిగుదామని లెఫ్ట్ డోర్ తీశా.. లాక్ అయ్యింది. డ్రైవర్ డోర్ ప్రయత్నించా. డ్రైవర్లు ఇద్దరు దూకేశారు. వెంటనే ఆ డోర్ కూడా లాక్ కాగా డోర్ మిర్రర్ పగులగొట్టా. చిన్న విండో కావడంతో కాలు ఇరుక్కుపోయింది. వెనుక నుంచి మరో వ్యక్తి నన్ను బయటకు తోసేశాడు. అంతే బతికి బయటపడ్డా. బెంగుళూరులో ఫార్మ కంపెనీలో ఇంటర్వ్యూ ఉందని బయలు దేరా. ఇక్కడే ఆగిపోవాల్సి వచ్చింది.ఒంటి మీద బట్టలు తప్ప ఏమీ లేవు. సెల్‌ఫోన్లు కూడా కాలిపోయాయి.

బస్ ఆపి ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదు



డ్రైవర్ బస్‌ను ఆపి ఉంటే ఇంత ప్రమాదం జరిగి ఉండేదీ కాదు. డోర్‌కు ఉన్న అద్దం పగలగోట్టా.. ముందు సీటు వ్యక్తి అరిచే సరికి లేచా. రోడ్డు పైన మంటలు.. బైక్ పెట్రోల్ ట్యాంక్ పేలి రోడ్డు మీద పెట్రోలు వాసనతో బస్సు ముందు బాగం రోడ్డు అంతా మంటలు. రోడ్డు కిందకు దిగాలంటే కూడా భయమేసింది. బస్ నిండా పొగలు ఎవరూ కనిపంచడం లేదు.. దాదాపు 14 మందిని నిద్ర నుంచి అప్రమత్తం చేశా. కిందకు దిగేందుకు ప్రయత్నం చేసిన అందులో కొందరు రాలేక మంటలకు ఆహుతి అయ్యారు. **- ఆకాష్, బీదర్, కర్ణాటక**

పది మందిని కాపాడాను



బస్ అంతా మంటలు. వెనుక భాగం వైపు వెళ్లాను. డోర్ కు ఉన్న అద్దం పగులగొట్టా... 10 మందిని కాపాడాను. అందులో చాలా మందికి గాయాలయ్యాయి. కొందరు దూక లేక పోయారు. అలోపే మంటలు చుట్టుముట్టాయి.. కళ్ల ముందు చూస్తుండగానే మంటల్లో కాళీ బూడిదయ్యారు. చిన్నారులు.. మహిళలు.. గాఢనిద్రలో ఉన్నారు. పాపం అనిపించింది. కాపాడేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆ ఘటన నుంచి తెరుకునే లోపే పోలీసులు చేరుకున్నారు. కుటుంబమంతా హైదరాబాద్‌లో ఉంటుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ప్రతి వారం హైదరాబాద్‌కు వచ్చి వెళ్తా.

- జయంత్‌కుశ్వహ, హైదరాబాద్

విహార యాత్రకు వచ్చి ..



గోళ్ల రమేష్ కుటుంబం విహార యాత్ర కోసం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ అగ్నికి ఆహుతయ్యారు. తిరుగు ప్రయాణంలో కర్నూల్లో దిగి వెళ్లమంటే కూడా విన లేదు.. దిగి పోయి ఉంటే బతికేవారేమో? రెండు కుటుంబాల్లో ఒక కుటుంబం సీ-7లో కింద కూర్చోవడంతో బయటకు దూకేసి బతికిపోయారు. గోళ్ల రమేష్ కుటుంబం బర్త్ పడుకునేందుకు బుక్ చేసుకున్నారు. ఇద్దరు పిల్లలతో గాఢ నిద్రలో తేరుకోలేక మంటల్లో విలవిల లాడి చనిపోయారని తోటి ప్రయాణికుల ద్వారా తెలిసింది. మాకు బంధువులు. నేను కర్నూల్లో ఉంటాను. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నా.

- మాధవి, నెల్లూరు

ఏనాడూ ఇంత ప్రమాదం చూడలేదు

నాకు 70 ఏళ్లు. ఏనాడూ ఇంతటి ప్రమాదం చూడలేదు. బైపాస్ అయ్యాక ఇంత ప్రమాదం జరగడం ఇదే తొలిసారి. హైవే పక్కన నాకు ఇరవై ఎకరాల పొలం ఉంది. నిత్యం హైవే మీద తిరుగుతూ ఉంటా. కానీ ఇంతటి ఘోరమైన సంఘటన చూడాలంటేనే బాధ వేసింది. ఘటన చూద్దామని వచ్చా.. అక్కడ చూస్తే పుర్రేలు.. కాలిన శవాలు తప్ప ఏమీ లేవు. ఇంతటి ఘోరమైన చావు ఎవరికీ రాకూడదు. నిద్రలో ఉండగానే అగ్నికి ఆహుతి అయ్యారు.

● బి. ఆంజనేయులు, చిన్నటేకూరు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

నంద్యాల టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్పీజీ పాఠశాల వద్ద ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొన్న సంఘటనలో ఉపాధ్యాయుడు శ్రావణ్‌కుమార్ (51) మృతి చెందాడు. ఎంఎస్ నగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ బనగానపల్లె ఇల్లూరి కొత్తపేటలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గురు వారం రాత్రి పనిమీద టౌన్‌లోకి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న సమ యంలో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రగాయాలైన శ్రావణ్ కుమార్‌ను బంధువులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య దీపచంద్రిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

జూపాడుబంగ్లా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తంగడంచ గ్రామ సమీపంలోని ఓ వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం జాతీయరహదారిపై ఉన్న కల్వర్టులోని వర్షపునీటిలో మృతదేహం తేలియాడుతుండగా పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం ముఖం, తలపై గాయాలనుబట్టి ఎవరైనా హత్యచేసి కల్వర్టులో పడవేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా ఎస్ఐ మల్లికార్జున ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. మృతదేహం అంగిలో ఆధార్‌కార్డు ఆధారంగా అతని పేరు నారాయణస్వామి(50) కర్ణాటకలోని చిక్ బళ్లాపూర్ జిల్లా గుడిబండకు చెందిన వ్యక్తి అని గుర్తించామని ఎస్ఐ తెలిపారు. కర్ణాటక పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించగా మృతుని భార్య అనితకు సమాచారం అందించామని, బుధవారం పనిమీద వెళుతున్నానని చెప్పివచ్చినట్లు చెప్పారని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీలో విద్యుదాఘాతంతో షేక్ నాసిబ్ (20) మృతి చెందాడు. ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన షేక్ మహ్మద్ దౌల్లా ఆటో డ్రైవర్. ఇతనికి ముగ్గురు కొడుకులు. నాసిబ్ రెండో కూమారుడు. నాసిబ్ వీవర్స్ కాలనీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో వెల్డింగ్ షాప్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం షాప్ తెరిచి లోపల ఉన్న సామాన్లు తీసుకోబోతుండగా అంతకుముందు రోజు కురిసిన వర్షానికి ఎర్త్ అయ్యి విద్యుదాఘాతానికి గుర య్యాడు. షాపులోని వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా.. మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. షేక్‌మహ్మద్ దౌల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

నాపరాతి గనుల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కొలిమిగుండ్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లె వద్ద ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అనంతపురం జిల్లా తాడిపత్రి నుండి 20మంది ప్రయాణికులతో కోవెలకుంట్లకు బయలుదేరింది. అంకిరెడ్డిపల్లె సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబో సుమారు 100 అడుగులు లోతున్న నీటి గని గుంత వైపు దూసుకెళ్లింది. దీంతో ప్రయాణికులు పెద్ద ఎత్తున హాహాకారాలు చేశారు. అయితే సరిగ్గా గని గుంత గడ్డపై మూడడుగుల దూరంలో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వంద అడుగుల లోతున్న గనిగుంతలోకి బస్సు పడి ఉంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించేది. మరోవైపు బస్సు ఆగి ఉన్న రెండడుగుల దూరంలో 11 కేవీ తీగలు కూడా ఉన్నాయి. డ్రైవరు అజాగ్రత్త వల్లే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. సీఐ రమేష్‌బాబు పరిస్థితిని సమీక్షించారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



చెన్నమ్మ సర్కిల్‌లో కొవ్వొత్తులతో నాయకుల నివాళి

కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నటేకూరు జాతీయ రహదారిపై బస్సు ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరులోని చెన్నమ్మకూడలిలో వైసీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కొద్దింగటల్లో గమ్యాన్ని చేరుకోవాల్సిన 19 మంది ప్రయాణికులు డ్రైవర్ నిర్లక్ష్యంతో మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేవారు. మృతుల కుటుబాలకు, క్షతగాత్రులకు నష్టపరిమారం చెల్లించాలని డిమాండ్ చేవారు.

● వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన ప్రజా ఉద్యమం పోస్టర్‌ను పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 28న కల్లూరు తసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం ఇవ్వనున్నట్లు కాటసాని తెలిపారు.



దెబ్బతిన్న వరిపంట

• మరో ఐదు రోజుల పాటు వర్షాలు
• అప్రమత్తంగా ఉండాలంటున్న యంత్రాంగం

చుట్టుముడుతున్న తుఫాన్

నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లాల్లో మరో ఐదు రోజుల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని భారత వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు మెరుపులతో, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని వెల్లడించారు. దీంతో జిల్లా అధికార యం త్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. వాతావరణ సూచనలకు అనుగుణంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బుధవారం రాత్రి జిల్లాలో సగటున 822.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.

శ్రీశైలానికి వరద

జలాశయంలో 190.77 టీఎంసీలు

శ్రీశైలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం నిలకడగా వస్తోంది. శుక్రవారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 15,480 క్యూసెక్కులు, సుంకేశుల ద్వారా 17,732 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 26,575 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 22,580 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వారా 35,315 క్యూసెక్కులు, మొత్తంగా 57,895 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 880.50 అడుగులు, పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 190.77 టీఎంసీలుగా నమోదయ్యింది.

మహాసభల కరపత్రాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 6, 7 తేదీల్లో కడపలో నిర్వహించనున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాగరాజు, పిక్కిలి వెంకటేశ్వర్లు, నాగార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో కరపత్రాలను విడుదల చేశారు. కార్పొరేట్, మతతత్వ, మనువాద శక్తులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రామకృష్ణ, నరసింహ, శేఖర్, లక్ష్మీదేవి, ముర్తుజాబి పాల్గొన్నారు.

కందిలో గూడు పురుగును నివారించండి

కోడుమూరు రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కంది పంటను ఆశించే గూడు పురుగును నివారించుకోవాలని ఏవో రవిప్రకాష్‌గౌడ్ సూచించారు. శుక్రవారం కల్లపరి గ్రామంలో పంటలను పరిశీలించారు. గూడుపురుగు, పచ్చపురుగు నివారణకు డెల్టా మెత్రిన్, నువాలురాన్, ల్యాంబ్డాసైలోత్రిన్‌లో ఏదో ఒక మందును ఎకరాకు 100ఎం.ఎల్ మోతాదులో పిచికారీ చేయాలన్నారు. వర్షాలకు 13-0-45 మైక్రోన్యూట్రియెంట్ ఎకరాకు కేజీ స్ర్పే చేయాలని తెలిపారు. ఆర్ఎస్కే సిబ్బంది వెంకటేశ్వర్లు, విజయ్, రైతులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు ప్రత్యేక ఆధార్ కేంద్రం

కర్నూలు కల్చరల్/లీగల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):



నమోదును పరిశీలిస్తున్న న్యాయాధికారి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి సూచనల మేరకు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అనాథ బాలలకు ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. బంగారుపేటలోని ఈ కేంద్రం ద్వారా విద్య, వైద్యం, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు తల్లిదండ్రులు లేని అనాథలను గుర్తించాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారుల సాయంతో జనన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి, అనంతరం ఆధార్ కార్డులు వచ్చేలా చేస్తామన్నారు. లీగల్ సెల్ సర్వీసెస్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, బచ్‌పన్ బచావో ఆందోళన్ చైల్డ్ రైట్స్ ఎన్జీవో మౌనిక, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విలువిద్య ఎంపిక పోటీలు ప్రారంభం



విలువిద్య క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అవుట్‌డోర్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి విలువిద్య ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేవీ సుబ్బారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ పాల్గొన్నారు. విలువిద్య సాధనతో మేధాశక్తి దేహ దారుఢ్య, ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు. విలువిద్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగరత్నమయ్య, సునీల్, పీఈటీలు జయపాల్, షెహనాజ్, సుమంగళి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో డ్రైవర్ మృతి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతదేహానికి ప్రభుత్వ డ్రైవర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ కన్ఫర్మేషన్ జాతీయ అధ్యక్షులు నాగేశ్వరరావు నివాళి అర్పించి, అసోసియేషన్ తరపున రూ.10వేలు అందజేశారు. గౌస్‌బాషా, ఆలీబాషా, అంజాత్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న నాగేశ్వరరావు

బస్సుప్రమాదంపై కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంపై ఉల్లిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సులోని రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో 125సి/ఎ, 106సి/1 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

ఓర్వకల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఓర్వకల్లులోని పొదుపు సంఘం భవనంలో ఉల్లాస్ అక్షర ఆంధ్రకేఫ్-2 ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఎంఈవో ఓంకార్ యాదవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో రమణయ్య, కోఆర్డినేటర్ ప్రతాప్, సూపర్‌వైజర్ నెమిలయ్య, ఏపీఎం వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు.

పరిశీలన గృహం తనిఖీ

కర్నూలు లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పరిశీలనా గృహాన్ని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. సత్ప్రవర్తనతో మంచివారిగా మారాని బాలలకు సూచించారు. లీగల్ సర్వీసెస్ యాక్టు ప్రకారం ఉచిత న్యాయ సాయానికి బాలలు అర్హులన్నారు. హోం సూపరింటెండెంట్ హుశేన్ బాషా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్, జుబేదాబేగం, జ్యువనైల్ జస్టిస్ బోర్డు చైర్మన్ అపర్ణ, సభ్యులు సునీత, మాధవి పాల్గొన్నారు.


వంటశాలను తనిఖీ చేస్తున్న వెంకట శేషాద్రి

జిల్లా న్యాయాధికారిని కలిసిన జైలు అధికారి

కర్నూలు లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే బదిలీపై వచ్చిన జిల్లా జైళ్ల అధికారి జి. రామకృష్ణ యాదవ్ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థిని కలిశారు. జిల్లాలోని జైళ్ల వివరాలను తెలియజేశారు. ఆయనతో పాటు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి ఉన్నారు.


న్యాయాధికారితో జైలు అధికారి

ఓటర్లకు సౌకర్యవంతంగా పోలింగ్ కేంద్రాలు

- కర్నూలు ఆర్వో పి. విశ్వనాథ్



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సౌకర్యవంతంగా ఓటు వేసేందుకు అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్వో పి. విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 258 పోలింగ్ కేంద్రాలుండగా, అదనంగా 60 కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలపై ఆర్వో చర్చించారు. గత ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది వరకు ఓటర్లు ఉండేలా చేడాలని అధికారులకు సూచించారు. అభ్యంతరాలను ఈ నెల 27లోపు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ ధనుంజయ, సూపరింటేండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

● నగరంలో అన్న క్యాంటీన్లను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, బరువు, తదితర అంశాలను సమీక్షించారు. ఎంఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

● అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించి, సందేహాలను నివృత్తి చేశారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, 1800 దరఖా స్తులను పరిశీలించాలని సూచించారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్‌బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం బాధాకరం

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదం బాధాకరమని సీపీఐ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద ఘటనా ప్రదేశాన్ని శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్. మునెప్ప, లెనిన్‌బాబు పరిశీలించారు. ప్రమాదంలో 19 మందితో పాటు బస్సు ఢీకొట్టిన వ్యక్తి మరణించడంపట్ల విచారం వ్యక్తం వేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కే.జగన్నాథం, సి.మహేష్, శ్రీనివాసరావు, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు..

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పీఎస్. రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, టి.రాముడు, ఎండి. అంజిబాబు, రాజశేఖర్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సర్వజన వైద్యశాలలో బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నరసింహులు యాదవ్, శ్రీను, అంజి ఉన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ, కల్లూరు ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. 8, 9, 10 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు రూ.4,500చొప్పున ఇచ్చినట్లు వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, కర్నూలు రీజియన్ హెడ్స్ ప్రసాద్, యూసుఫ్ తెలిపారు.


స్కాలర్‌షిప్ ఇస్తున్న శ్రీరామ్ ఫైనాన్స్ ప్రతినిధులు

ఉల్లి.. పారబోసి..

కోడుమూరు రూరల్, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): కోడుమూరుకు చెందిన ఈ రైతు బోయ రాజు. ఖరీఫ్‌లో నాలుగెకరాల్లో ఉల్లి సాగు చేశాడు అందులో రెండెకరాలు కౌలు. నారు, నాటు, కలుపులు, ఎరువులు, పిచికారీ ఖర్చులన్నీ కలిపి దాదాపు రూ.2.70 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఉల్లిగడ్డలు తీయించేందుకు కూలీలకు రూ.12 వేలు ఖర్చు చేశాడు. తీరా మార్కెట్ ధర క్వింటా ఉల్లి రూ.500లోపే ఉండటంతో ఏం చేయాలో తెలియక ఉల్లిగడ్డలను పొలంలోనే పారబోశాడు. ఇక రెండుమూడు రోజుల్లో శనగ విత్తనం వేయనున్నట్లు రైతు తెలిపాడు.


ఉల్లిని పారవేస్తున్న రైతు బోయరాజు

ప్రమాదం కలచివేసింది

కర్నూలు రూరల్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద బస్సు ప్రమాదం కలచివేసిందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కారణాలను తెలుసుకు న్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బస్సు అగ్ని ప్రమాదంపట్ల కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూలనాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


ప్రమాద స్థలంలో నాయకులు

పిటిషన్ వేయడంలో జాప్యమెందుకు?

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2010 ముందు నియమాకమైన ఉపాధ్యాయులందరూ టెట్ ఉత్తీర్ణత పొందాలన్న సుప్రీం కోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని మాజీ ఎమ్మెల్సీ, ఏఐఎస్‌టీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి కోరారు. శుక్రవారం ఎస్టీయూ భవన్‌లో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఇన్ సర్వీసు టీచర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. జోసెఫ్ సుధీర్‌బాబు, ఈ.షణ్ముర్తి, హెచ్. తిమ్మన్న, ఎస్.గోకారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

ప్రిన్సిపాల్‌ను నియమించాలి

- ఆర్‌యూ వీసీకి విద్యార్థి నాయకుల వినతి

కర్నూలు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఆర్‌పిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వీసీ వి.వెంకట బసవరావుకు వినతి ప్రతం ఇచ్చారు. వర్శిటీలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందుతుందని సూదుర ప్రాంతాల నుంచి వస్తే ఇక్కడ అధ్యాపకులు లేకపోవడం దురదృష్ట కరమని వాపోయారు. పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాలన్నారు. విద్యార్థి నాయకులు కిరణ్, మధు, హేమంత్, మనోజ్, పహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జీఈహెచ్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బీజేపీ నాయకుడు పీటీ సాయి ప్రదీప్ క్షతగాత్రులను పరామార్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌ను కోరామన్నారు. .

PUBLIC NOTICE

UNDER the instructions of my client M/s.Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My clients intends to grant loan to **Smt.Challa Ravi Kumar, S/o. Sri. Challa Lakshmanna, Resident of H.No.40/104-A, Bangaru Peta, Kurnool,** by keeping the below mentioned property of Smt.Challa Narayanamma, W/o. Sri. Challa Lakshmanna, Resident of H.No.40/104-A, Bangaru Peta, Kurnool as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential house bearing door No.**40/104-A** (Southern side portion with up stairs), Bangaru Peta, Kurnool, constructed in Sy.No. **86/2** of Kurnool, with in Sub Registration office of Kurnool and Dist. Registration office of Kurnool and bounded as follows.

Boundaries : East : House of Vadde Yellamma, **West :** House of Yemmiganur Narasappa, **North :** Remaining same house sold to Vadde Venkata Swamy, **South:** Rastha, Extent : **34.44** Sq.Yards

**Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646**

PUBLIC NOTICE

UNDER the instructions of my client M/s.Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My clients intends to grant loan to **Sri.Shaik Khaja Hussain, S/o.Shaik Khasim, Resident of H. No.77/110-A-1, Chinthalamuni Nagar, Near Ismail Masjid, Kallur, Kurnool** by keeping the below mentioned property of Sri.Shaik Hassan, S/o.Sri. Shaik Khaja Hussain, Resident of H. No.77/110-A-1, Chinthalamuni Nagar, Near Ismail Masjid, Kallur, Kurnool as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential house bearing door No.**77/13**, constructed in plot no.**2**, in Sy. Nos. **450/A & 449/4** of Kallur village, with in Sub Registration office of Kurnool and Dist. Registration office of Kurnool and bounded as follows.

Boundaries : East : Road leading to Pandipadu village, **West :** Plot No.1, **North :** Remaining half of the same plot, **South:** Plot No.4, **Extent : 108.33** Sq.Yards

**Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646**

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించాలి

● మోడల్ స్కూల్స్ ఏఎంవో సలీంబాషా


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంవో సలీంబాషా

ఆలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు వచ్చేలా అధ్యాపకులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలని స్టేట్ మోడల్ స్కూల్స్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీంబాషా సూచించారు. శుక్రవారం ఆలూరు మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాటాడారు. శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. సబ్జెక్టులలో సందేహాలు ఉంటే ధైర్యంగా అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్ల్ హాస్టల్‌ను సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల గడువు తేదీని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్ సుధారాణికి సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ వీరేష్ ఉన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆస్పరి: వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని మోడల్ స్కూల్స్ స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సలీంబాషా ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పుటకలమర్రిలో ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షమీల, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

ఆదోని రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదవాళ్లకు అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేకల్లు రామకృష్ణ తెలిపారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హోటల్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముందుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్య బాబు చైర్మన్‌గా ఆరేకల్ రామకృష్ణతోపాటు మరో ముగ్గురు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆదోని నుంచి టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు, ఆరేకల్, ఆదోనికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఆస్పరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బి.కె.అనిల్, నాయకులు వంశీ, వరప్రసాద్, జగదీష్, ఏఐవైఎఫ్ మడల కార్యదర్శి రమేష్, నాయకులు లక్ష్మన్న, సురేష్, రామచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కాన్ చేసి మద్యం నాణ్యతను తెలుసుకోండి

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
● ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్ స్కాన్ చేసి నాణ్యతను తెలుసుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వహయాంలో నాణ్యతలేని మద్యం తాగి ఎందరోప్రాణాలు కోల్పోయారన్నారు. టీడీపీ హయాంలో నాణ్యమైన మద్యం అందించేందుకు ఎప్పటికప్పుడు ప్రత్యేకచర్యలు చేపడుతుందన్నారు. ఎక్కడైనా నాణ్యతలేని మద్యం అమ్మినట్లు గుర్తిస్తే వెంటనే పోస్టర్‌లో తెలిపిన టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. అంతకు ముందు ఆదోని రహదారిలోని స్వస్తిక్ వైన్‌షాప్‌లో వివిధ బ్రాండ్ల నాణ్యతను ఎమ్మెల్యే స్వయంగా స్కాన్‌చేసి నాణ్యతను పరిశీలించారు.

సొసైటీ భవన నిర్మాణానికి భూమి పూజ: పత్తికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు శుక్రవారం భూమి పూజ చేశారు. నూతన భవన నిర్మాణానికి సొసైటీ సిద్ధం కావడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు చందోలి రంగప్ప మాట్లాడుతూ రూ. 25.5లక్షల నిధులతో భవన నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఏసు, ట్రైబల్‌బోర్డుసభ్యుడు వెంకటపతి, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, చల్లారవి, ఈశ్వరప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్


మద్యం షాపులో బార్ కోడ్‌ను తనిఖీ చేస్తున్న వైకుంఠం శివప్రసాద్

ఆలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం విక్రయిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. శుక్రవారం అరికెర రోడ్డులో ఉన్న మద్యం షాపులో మద్యం బాటిళ్లపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను పరిశీలించి యాప్ ద్వారా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా వివిధ బ్రాండ్‌లతో జగన్ కల్తీ మద్యాన్ని విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తోందని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా మద్యం బాటిళ్లపై బార్ కోడ్ విధానాన్ని అమర్చిందని తెలిపారు. ఈ విధానం ద్వారా మద్యం బ్రాండ్ దుకాణం పేరు యజమాని పేరు కనిపిస్తుందన్నారు. అలాగే బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం, టీడీపీ నాయకులు కటారికొండ సీనప్ప, తిమ్మయ్య, ప్రకాష్, నరసప్ప, మోకా మల్లయ్య, కిషోర్, మసాల జగన్, ఉలిగప్ప, గోవింద్, బీటీ రాజు, బీజేపీ నాయకులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

దేవనకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతిరైతుకు ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా చెల్లించాలని సీపీఎం నాయకుడు బి.వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జె.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల వ్యాప్తంగా పి.కోటకొండ, తెర్నెకల్, కరివేముల, దేవనకొండ సచివాలయాల ముందు వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రైతులు వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఉల్లి, పత్తి, కందులు, ఆముదం, టమోటా తదితర పంటలు సాగు చేస్తే అకాల వర్షాలలతలో పంటలకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. నాయకులు అశోక్, సూరి, మాబాషా, సుధాకర్, సుభాన్, వై.శేఖర్, వీరంజి, రామంజి, జె.హరిశ్చంద్ర, నరసింహులు, రషీద్, బాషా పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

చిప్పగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖాతాలో డబ్బు కాజేసి లూటీ చేసే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిప్పగిరి కెనరా బ్యాంకు మేనేజర్ గోవిందరావు సూచించారు. శుక్రవారం చిప్పగిరి ఫాతిమా పాఠశాలలో ఆన్‌లైన్ మోసాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బ్యాంకులో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన విషయంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా పదో తరగతి చదువుతున్న ఎం.భీమేష్‌కు, రెండో విజేత అయిన కె.తేజశ్రీకి బ్యాంకు మేనేజర్ గోవింరావు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ లూసీ, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తుగ్గలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్న పేదవారు ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకుంటే దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించడం కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. స్థలం ఉన్న ప్రతి ఒక్కరూ సచివాలయంలోని ఇంజనీర్‌ను కలిసి నవంబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పర్యటించి అర్హులను గుర్తిస్తామన్నారు.

పక్కా గృహాలకు..

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఖాళీ స్థలం ఉన్నవారు పక్కా గృహం నిర్మించుకునేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్ తెలిపారు. శుక్రవారం హౌసింగ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారు సంబంధిత గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. నవంబరు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

వృత్తి విద్య అవసరం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్య విద్యార్థులకు ఎంతో అవసరమని పెద్ద తుంబలం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మారుతి ప్రియ అన్నారు. శుక్రవారం వృత్తి విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక వైద్య చికిత్సపై ఆసుపత్రిని, గ్రామీణ బ్యాంకు, గ్రామ సచివాలయం, విద్యుత్ ఉపకేంద్రాలను సందర్శించి వాటిపై అవగాహన కల్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ వృత్తి విద్య వల్ల త్వరగా ఉపాధి పొందవచ్చని సూచించారు. ఉపాధ్యాయులు సైనా భాను, వెంకటేష్, రామాంజినేయులు పాల్గొన్నారు.

పోటాపోటీగా చేపల చెరువు వేలం

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలోని గొంది వెంకన్న చెరువులో చేపలు పెంచుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పోటాపోటీగా సాగింది. శుక్రవారం సర్పంచ్ నంది కల్పన, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయ ఆవరణంలో వేలం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామానికి చెందిన ఆకుల ఓబులేసు రూ.లక్షకు వేలం దక్కించుకున్నారు. గతంలో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఎంతో కొంత కట్టించుకుని ఇచ్చేవారు. అయితే ఈ ఏడాది పంచాయతీకి ఆదాయ వనరులు సమకూర్చాలనే ఉద్దేశంతో బహిరంగ వేలం నిర్వహించడం టతో రూ.లక్ష ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పరమేశ్వరప్ప, విజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మద్దికెర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నేషే వీధి, మోమీన్ వీధి, రామస్వామిగుడి వీధిలో ట్యాంకర్లను ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తుల నుంచి కాపాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యుడు రంగనాయకుడు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని సర్వే నెంబర్ 232, 230లలో ఇంకా ఇతర సర్వే నెంబరులో ప్రభుత్వ భూములు, కాలువ వాగుకు సంబంధించిన భూములు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా కాలువ రస్త భూములను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుని రాజకీయ నాయకుల అండదండలతో కబ్జా చేశారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్లకు ఐఎఫ్‌టీయూ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చంటి, పరుశురాముడు, రమేష్, చరణ్ ఉన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఆదోని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం హనవాళ్ గ్రామానికి చెందిన చికెన్ దుకాణ నిర్వాహకుడు ఎక్బాల్ అదే గ్రామానికి చెందిన రంజాన్‌ను కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. వారం రోజుల క్రితం ఇక్బాల్‌కు అదే గ్రామానికి చెందిన హుసేన్ మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. అక్కడే ఉన్న బాధితుడు రంజాన్ వారి ఘర్షణను విడిపించే ప్రయత్నం చేశాడు. అది మనస్సులో పెట్టుకొన్న చికెన్ దుకాణ నిర్వాహకుడు ఫుల్‌గా మద్యం తాగి శుక్రవారం రంజాన్ తలపై కత్తితో దాడి చేయడంతో చెయ్యి తెగిపోయి వేలాడుతోంది. దీంతో పాటు తలకు తీవ్రగాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'

ఆదోని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ లిల్లీ లోబో, హెచ్ఎం సిస్టర్ రీనా పవిత్ర అన్నారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ అండర్-14 బాలుర విభాగంలో సి.చరణ్ సాయి, అండర్-14 బాలికల విభాగంలో ఎన్.కేథరిన్‌భాను, అండర్-17 బాలికల విభాగంలో బి.హర్షప్రియ ఎంపికయ్యారన్నారు.

బస్సు ప్రమాదం కన్నీరు పెట్టించింది

మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



ఆదోని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం కన్నీరు పెట్టించిందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బస్సులోని ప్రయాణికులు 19 మంది, ఓ బైకు రైడర్ మృతి చెందడం బాధాకరమని అన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మీనాక్షి నాయుడు ఆకాంక్షించారు.

ఈ ఘటన బాధాకరం

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



ఆలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో 20 మంది మృతి చెందడం బాధాకరమని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నా రు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి సహాయక చర్యలు చేపట్టిందన్నారు. మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కేంద్రం ఇప్పటికే మృతులకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు సహాయం ప్రకటించిందన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలి'

ఆదోని టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదం చాలా విషాదకరమని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాత్రి దూర ప్రయాణం చేస్తూ ఏసీ బస్సులలో ప్రమాదం జరిగితే ప్రయాణికులు బయట పడే పరిస్థితులు లేవని, బస్సు చివర్లో విమానాలలో మాదిరిగా స్లైడర్ డోర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హైవేలలో ప్రమాదాలు జరిగితే ఆదుకోవడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటు ఉండాలని, జాతీయ రహదారులపై నిఘా పెంచాలని విజ్ఞప్తి చేశారు. వాహనాల నుండి టోల్ వసూలు చేయడమే కాకుండా, ప్రయాణికులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత కూడా అప్పగించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఆదోని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో బస్సులోని 19 మంది సజీవ దహనం కావడం బాధాకరమని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పీడీఎస్‌వో, ఎన్‌వైఎస్ నాయకులు తిరుమలేష్, వీరేష్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో మృతిచెందిన 19 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన ప్రయాణికులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

వెల్దుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్యాస్ ప్రమాద ఘటనలో చికిత్స పొందుతున్న అనిల్‌కు మెరుగైన వైద్యం అందించాలని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం కర్నూలు సర్వజనవైద్యశాలలో చికిత్స పొందుతున్న అనిల్‌ను పరామర్శించారు. కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేశారు. గ్యాస్ ప్రమాదం, బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, కలెక్టర్ సిరిని కలిసి బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపాలుబాబు, వడ్డెర నాయకులు మహేశ్, చక్రవర్తి, రామకృష్ణ, అశోక్, మద్దిలేటి, రవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: ఏఐఎస్ఎఫ్

పత్తికొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తే అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న హెచ్చరించారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల కూడలిలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంతో ప్రైవేట్ పరం చేసేందుకు పూనుకుందన్నారు. ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ పేరుతో మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికే పాలకుల ఆలోచన అని చెప్పారు. కళాశాలలన్నింటినీ తాము నడపలేమని చెప్పడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఉప సంహరించుకునేలా చూడాలన్నారు. అలాగే ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నజీర్, మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్, శివ, ఏఐవైఎఫ్ నాయకులు అల్తాఫ్, మోహన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అహ్మద్, సిరి పాల్గొన్నారు.

28 నుంచి ధార్మిక కార్యక్రమాలు

ఆలూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆలూరు పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సాయంత్రం 6 గంటల నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డా.మల్లు వెంకటరెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాన్ కీర్తిరాజదాస్ స్వామి ధార్మిక ప్రవచనాలు చేస్తారని తెలిపారు. స్థానిక భజన మండలితో భజన, గోపూజ, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. దేవరగట్టు మాలమల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వీరనాగప్ప పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

● ఎమ్మిగనూరు డివిజన్‌లో పప్పుశనగ సాగుపై రైతుల దృష్టి

● సబ్సిడీపై విత్తనాల పంపిణీ

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు డివిజన్‌లో రబీ సీజన్‌లో రైతులు ముఖ్యంగా సాగు చేసుకునే పంటలలో పప్పుశనగ ప్రధానమైన పంట ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలలాలో దాదాపు 3500 ఎకరాలో ఈ పంటను సాగు చేస్తారు. ఎక్కువగా గోనెగండ్ల మండలంలనే 2000 ఎకరాల వరకుసాగు అవుతుంది. ఈ పంటకు సంబందించిన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేస్తుంది. సబ్సిడీ కింద మూడు మండలాలకు 230 కింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం విడుదల చేసింది. గోనెగండ్ల మండలంకు 200 క్వింటాళ్లు, ఎమ్మిగనూరుకు 80 క్వింటాళ్లు, నందవరకు 50 క్వింటాళ్లను పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యం అని అధికారులు తెలుపుతున్నారు.

సాగు రకాలు

ఈ పంటను ఎక్కువగ రబీ సీజన్‌లో అక్టోబరు 15 నుంచి నవంబరు 15వ తేది వరకు సాగు చేసుకునేందుకు అనువైన సమయం ఇది కేవలం తేమ తో పండే పంట కావున చలికాలంలో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తారు. ప్రస్తుతం జేజీ11 రకం, సాగులో ఉంది. ఇవే కాకుండా నూతన వంగడాలు అయితన ఎన్‌బీఈజీ 452 ఎన్‌బీఈజీ 776, ఎబీఈజీ 857, కూడా సాగు చేసుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు.

విత్తే విధానం

గింజలు భూమిలో 5-8 సెంటీమీటర్ల లోతున పడేటట్టు విత్తుకోవాలి.



వరసల మద్యం 30 సెంటీమీటర్లు మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఉండేటట్లు చూసుకోవాలి.

విత్తన మోతాదు

ఎకరానికి 30 నుంచి 35కిలోల విత్తనాలు విత్తుకోవాలి

విత్తన శుద్ధి అవసరం:

కిలో విత్తనానికి వైటవాక్స్ 1.5 గ్రాములు, లేదా రాక్సిల్ 1గ్రాము కలుపుకొని విత్తన శుద్ధి చేసుకోవాలి. తర్వాత ట్రైకోడర్మావిరిడి 8-10 గ్రామలులు కిలో విత్తనానికి కలుపుకొని విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలి.

ఎరువులు:

ఎకరానికి 18 కిలోల యూరియా, 125కిలోల సూపర్‌ఫాస్పేట్ ఎరువులు లేదా 50కిలోల డీఏపీ ఎరువు వేసుకోవాలి. అలాగే ఎకరంకు 8-10 కిలోల గంధకం గుళికలు వేసుకుంటే మంచిది.

కలుపు యాజమాన్యం:

విత్తిన 24 గంటలలోపు ఎకరానికి 1.2 లీటర్ల పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారీ చేసుకుంటే కలుపును సమర్థవంతంగా అరికట్ట వచ్చును. 30 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా అంతర కృషి చేయాలి. లేదా అవసరం అయితే కూలీలతో కలుపు తీయించుకోవాలి.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం పప్పు శనగ సాగు చేసే రైతులకు సబ్సిడీ కింద విత్తనాలు అందజేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. క్వింటం పప్పుశనగ విత్తనాలు రూ. 7800 అయితే సబ్సిడీ కింద రూ. 5850 కి అందజేస్తోంది. ఒక రైతుకు పొలాన్ని బట్టి ఒకటి నుంచి మూడు బ్యాగ్‌లు అందజేస్తున్నారు. ఒక బ్యాగ్‌లో 20 కేజీ విత్తనాలు ఉంటాయి. ఇదే విత్తనా సాగుక అనువైన సమయం కావున రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలి.

- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

పోస్టరు ఆవిష్కరణ



పోస్టరును విడుదల చేస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదిన చేపట్టబోతున్న ప్రజా ఉద్యమ పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక విడుదల చేశారు. ఆమెతో పాటు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా ఆస్తులను ప్రైవేట వ్యక్తులకు అప్పగించే దిశగా వ్యవహరించడం చాలా దారుణమన్నారు. ప్రజలకు అందించాల్సిన కనీస సౌకర్యాలను, అవసరాలను కల్పించాల్సిన భాద్యత ప్రభుత్వానిది అని అన్నారు. మహిళలకు ఎలక్షన్‌కు ముందు ఇచ్చిన హామిలో భాగంగా స్త్రీ నీధిని దానిని కూడా పీ4లో భాగం అని చెప్పడం స్త్రీలను మోసం చేయడమేనన్నారు. ప్రజలోకి వెళ్లి అవగాహన కల్పిస్తూ కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెర్నేకల్లు సురేందర్‌రెడ్డి, బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, నరసింహులు, విరుపాక్షిరెడ్డి, లతారెడ్డి పాల్గొన్నారు.

మొక్కలను పరిరక్షించాలి



మొక్కకు నీరు పోస్తున్న ఏపీవో, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు

మంత్రాలయం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడమే కాదు.. వాటిని పరిరక్షించడం అందరి బాధ్యతగా గుర్తించిన నాడే హరిత పాఠశాలగా మారుతుందని ఉపాధి ఏపీవో భక్తవత్సలం, ప్రిన్సిపాల్ అశోక్‌నాయక్ అన్నారు. రచ్చమర్రి మోడల్ పాఠశాలలో శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల మైదానంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఉపాధ్యాయులు ప్రసాద్ నళని, సోమలింగం, షరీఫ్‌వళి, వైష్ణవి, భాగ్యలక్ష్మి, టీఏ, ఎఫ్ఏ పాల్గొన్నారు.

రాఘవరాయలకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాలంకరణ, మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం చేశారు. శుక్రవారం కార్తీక మాస తదియ శుభదినాన్ని పురస్కరించు కొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి, గ్రామ దేవత మంచాలమ్మకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన నిర్వహించారు.

జీడీపీ నుంచి నీరు విడుదల

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు 4వ గేటు నుంచి శుక్రవారం 336 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నంది. గురువారం ఉదయం నీరు విడుదల చేశారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు గత నాలుగు రోజుల నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం ప్రాజెక్టుకు 120 క్యూసెక్కుల నీరు చేరుతుండటం, ఎల్లెల్సీ నుంచి 190 క్యూసెక్కులు చేరడంతో 336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జీడీపీ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల వరదనీరు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాలలో వర్షాలు కురియడంతో వరద నీరు జీడీపీకి చేరుతోంది.

'సమస్యలు పరిష్కరించడం లేదు'



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్

పెద్దకడబూరు , అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయులు ఆరోపించారు. పెద్దకడబూరులోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరుసుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు నిండి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథేడే కరువయ్యారన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే గ్రామాలు కంపుకొడుతున్నాయన్నారు. అలాగే తాగునీరు, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించడంలేదన్నారు. సమావేశంలో చంద్ర, తిక్కన్న, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

25.2 మి.మీ. వర్షపాతం నమోదు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో 25.2 మి.మీ. వరపాతం నమోదయినట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయన్నారు. రైతులు వర్షాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫేడరేషన్‌లో భాగంగా అండర్ 14, 17 క్రీడలు బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవిందు క్రీడలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం వల్ల ఆరోగ్యంతో పాటు, ఉత్తేజం, మానసిక ఉల్లాసం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. గెలుపోట ములను సమానంగా స్వీకరించాల న్నారు. ఈ పోటీలలో ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల నుంచి వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. శుక్రవారం కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, చెస్, యోగ క్రీడల్లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శనివారంతో ఈ పోటీలు ముగుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ బజారప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, హనీఫ్‌లు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి: ఏఐఎస్ఎఫ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు, విద్యార్థులు

కోసిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడాన్ని విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. కోసిగి లోని మోడల్ స్కూల్ ప్రధాన రోడ్డుపై శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శాపంగా జీవో నెం 107,108 రద్దు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ భూములను ప్రవేట్ వారికి అప్పజెప్పడం సిగ్గు చేటుఅన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లికార్జున, సోమశేఖర్, ఆదిమూర్తి, వంశీ, తేజ, శ్రీరామ్, పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



రెసిడెన్సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, దశరథరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు సరిపడ ధరలకు అన్ని విధాలుగా సేవలు అందించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి సూచించారు. శుక్రవారం మంత్రాలయంలో కాంట్రాక్టర్ బంగారుబాబు నిర్మించిన న్యూ బీఎంఆర్ రెసిడెన్సీ ని వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు దశరథరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, బెస్త ఆంజనేయులు, ఎంపీటీసీలు వెంకటేష్‌శెట్టి, మేకల వెంకటేష్, రామాంజనేయులు ఆధ్వర్యంలో రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. వైసీపీ నాయకులు మాజీ సర్పంచు అల్లింగప్ప, మంచాలసొసైటీ డైరెక్టర్ డీసీ తిమ్మప్ప, దుల్లయ్య, మద్దిలేటి, చిన్నారెడ్డి, మజ్జిగ రోగప్ప,బసిరెడ్డి, వీరేష్, కేవీపీఎస్ నాయకులు అనిల్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

కౌతాళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని జంగాల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు మండల వైకాపా నాయకులతో కలిసి భూమి పూజ చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి, మాజీ జడ్పీటీసీ కృష్ణంరాజు, సర్పంచ్ పాల్‌దినకరన్, ఎంపీపీ అమరేశ, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, వైకాపా నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు కౌతాళంలో బసవలింగేశ్వర దేవాలయంలో నిర్మించిన నూతన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.

సాగునీరు అందించాలి

పెద్దకడబూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు మండలంలోని రైతులకు సాగు, తాగునీటిని అందజేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, దాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీపీ శ్రీవిద్యను కలిసి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే సభా కరపత్రాన్ని అందజేశారు. పెద్దకడబూరులో ఈనెల 27వ తేదీన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం స్థానిక సొసైటీ కార్యాలయ ఆవరణలో సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి

కోసిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశాభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి అన్నారు. కోసిగిలోని బెళగల్ రోడ్డులో శుక్రవారం బీజేపీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంబించారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా జడ్లయ్యగారి ఈరన్న ఎన్నిక కావడంతో ఆయనను పూలమాల శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు గురురాజ దేశాయి హాజరయ్యారు. బీజేపీ నాయకులు పెండెకల్లు రాముడు, నరసన్న, వెంకటరెడ్డి, తమ్మారెడ్డి, దొరస్వామి, వీరేష్, నాగరాజు, రమేష్, దేవేంద్రప్ప, పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా బడేసానాయుడు

గోనెగండ్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నేషనల్ యాంటీ కరప్షన్ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గోనెగండ్లకు చెందిన బడేసా నాయుడిని ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ రాజేష్ శుక్లా ప్రకటించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిన రాజేష్‌శుక్లా కు బడేసా నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బడేసానాయుడు మాట్లాడుతూ తాను అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ ను స్థాపించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను పునరుద్ధరించాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య సేవలను నిలిపివేయడంతో ఎంతో మంది పేద ప్రజలు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.650 కోట్ల బిల్లులను వెంటనే ప్రైవేటు ఆస్పత్రుల ఖాతాల్లోకి జమచేయాలన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై లైంగిక అఘాయిత్యాలు.. నివారణపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు పట్టణ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 130 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో జరుగు పోటీలకు ఏంపిక చేస్తారని ఎస్ఐ తెలిపారు. హెచ్‌ఎం గోవిందు, కిష్టప్ప నాయక్‌లు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అమరేశ

కౌతాళం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను చేపట్టేందుకు నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల కేంద్రమైన కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అమరేశ అధ్యక్షతన తూతు మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు మండల అధికారులు. మండలంలో డ్రైనేజీ, తాగునీటి సమస్య, రోడ్ల స్థితిగతులపై చేపట్టాల్సిన సమావేశంలో మండల అధికారులకు ఎంపీడీవో ముందస్తు సమాచారం లేకపోవడంతో చాల శాఖ అధికారులు సమావేశానికి ఆలస్యంగా హాజరయ్యారు.గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోటి సంతకాల స్వీకరణ కార్యక్రమం ఉండటంతో మెజారిటీ ఎంపీటీసీలు ఎమ్మెల్యే కార్యక్రమానికి హాజరయ్యారు.

వైసీపీ హయాంలో ప్రాణాలతో చెలగాటం: టీడీపీ



ఎమ్మిగనూరులో మద్యం నాణ్యత వివరాలను సురక్ష యాప్ ద్వారా వివరిస్తున్న టీడీపీ నాయకులు



గోనెగండ్లలో..

ఎమ్మిగనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నకిలీ మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముకొని మద్యం ప్రియుల ప్రాణాలతో చెలగాటమాడారని మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్ అన్నారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాలు దగ్గర శుక్రవారం అక్రమ మద్యం, ప్రజా భద్రత ప్రచార కార్యక్రమాన్ని టీడీపీ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సురక్ష యాప్ ద్వారా మద్యం నాణ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రామదాసుగౌడ్, మహేంద్రబాబు, దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, రంగస్వామి గౌడ్, నరసన్న గౌడ్, కటారి రాజేంద్ర, నరసప్ప, వినయ్, జగదీశ్, లోకేశ్, నరసింహులు, హనుమంతు, లక్ష్మణ్, వెంకటేశప్ప, రాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల: కల్తీ మద్యంను అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం, ఇతరుల పై బురదజల్లటం వైసీపీతోనే సాధ్యం అని టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, నజీర్, రఫీక్ , మహల్ రహంతుల్లా అన్నారు. గోనెగండ్లలోని మద్యం దుకాణం దగ్గర శుక్రవారంక్యూఆర్ కోడ్ తో స్కాన్ చేసి మద్యం వివరాలు తెలసుకోవచ్చని టీడీపీ నాయకులు అవగాహన కల్పించారు. నాయకులు హెచ్‌కైరవాడి రాజేష్, డాక్టర్ మిన్నల్ల, ఫకృద్దీన్, కులుమాల రాముడు, శ్రీధర్, బాబునాయుడు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గేటు వద్దే ఆపేశారు..!

ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయానికి దీపావళి సెలవులు రావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. సెలవుల అనంతరం 22వ తేదీన విద్యార్థులు విద్యాలయానికి రావాల్సి ఉంది. అయితే కొందరు విద్యార్థులు శుక్రవారం ఉదయం విద్యాలయానికి రావడంతో వారిని లోపలికి అనుమతించలేదు. ఉదయం వచ్చామని, మధ్యాహ్నం వరకు ఎండలో గేటు ముందు నిల్చోబెట్టడమేగాక కనీసం తాగేందుకు నీరు కూడా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఎమ్మిగనూరు రూరల్



ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు

● వచ్చే నెల 14 వరకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్/కోసిగి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఆయా పాఠశాలల్లో 10,7వ తరగతి చదివే విద్యార్థులు నగదు బహుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మిగనూరు మండల విద్యాధికారి-2 మధుసూదన్‌రాజు, కోసిగి ఎంఈవో బాలయ్య వేర్వేరుగా తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 7, 10వ తరగతి చదివే విద్యార్థులు ఈఈఎంటీ ఆన్‌లైన్ పరీక్షల కోసం నవంబరు 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పరీక్షలు ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు దశల్లో జరుగుతాయన్నారు. ప్రిలిమ్స్ పరీక్షలను ఆయా పాఠశాలల్లోగాని, ఇంటి వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ రాసుకోవచ్చన్నారు. అయితే మెయిన్స్ పరీక్షలను మాత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే రాయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే ఈ పరీక్షల్లో 10వ తరగతి విద్యార్థులకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు అందజేయనున్నట్లు తెలిపారు. 7వ తరగతి విద్యార్థులకు మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో నిలిచిన మూడు స్థానాల వారికి మొదటి బహుమతి రూ.8 వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ.4వేలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాస్థాయిలో విజయం సాధించిన 7వ తరగతి విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు.

బస్సు ప్రమాదం తీవ్రంగా కలచివేసింది

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మిగనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూర వద్ద జరిగిన బస్సు ప్రమాదం తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకూడదన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందన్నారు.

ఈ ఘటన చాలా బాధాకరం

● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ, జనసేన మంత్రాలయం ఇన్‌చార్జిలు రాఘవేంద్ర రెడ్డి, లక్ష్మన్న



బాలనాగిరెడ్డి



రాఘవేంద్రరెడ్డి



లక్ష్మన్న

మంత్రాలయం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):: కర్నూలు జిల్లా చిన్నటేకూరు గ్రామసమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన బస్సు ప్రమాదం దురదృష్ట కరమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, జనసేన ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మన్న శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 19మంది సజీవ దహనం కావడం చాలా బాధాకరమని అన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసి బంధువులకు అండగా నిలిచారని అన్నారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు యజమానులది నిర్లక్ష్యం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని, కుటుంబ సబ్యులు ధైర్యంగా ఉండాలని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్: చిన్నటేకూరు దగ్గర జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు జానయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జై భీమ్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాలు కమీషన్లకు ఆశపడి, రాజకీయ పలుకుబడితో అనుమతుల తెచ్చుకొని, ఫిట్నెస్ లేని బస్సుల వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ఎమ్మిగనూరు రూరల్: చిన్నటేకూరు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మృత్యువాత పడిన బాధితులకు ఒకొక్కరికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందజేసి కుటుంబ ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు.

గోనెగండ్ల: చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బస్సు దగ్ధమై 20 మంది సజీవ దహనం కావడం బాధకరం అన్నారు. క్షత గాత్రులకు ప్రభుత్వం వెంటనే వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ ఘటనలో మృతి చెందిన వారికి రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు మృతి చెందిన వారి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.